W W W.EPAPER.MAHADAILY.COM

మహా పత్రిక

ఖమ్మం

భద్రాద్రి కొత్తగూడెం

15-10-2025

## ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్

వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఐ.డి.ఓ.సి. సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,38,177 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా ఉందని, అందులో సన్నరకం 2,02,862 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 35,315 మెట్రిక్ టన్నులు ఉంటాయని తెలిపారు.



07



## అశ్వారావుపేట బీఆర్ఎస్‌లో చిచ్చు 02

**మాజీ ఎమ్మెల్యేల మధ్య బహిరంగ ఘర్షణలు**

అశ్వారావుపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఇప్పుడు బహిరంగ రంగానికి చేరాయి. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మధ్య చోటుచేసుకున్న ఘర్షణలు ఇప్పుడు కార్యకర్తల్లో అయోమయాన్ని సృష్టించాయి.



08

## టన్ను చెరుకు ధర రూ.3578

**టన్నుకు రూ.500 బోనస్ ఇవ్వాలని కోరాం**

మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు రైతులకు అన్ని సబ్సీడీలతో కలిపి టన్ను రూ.3578.35 లను ఇవ్వనున్నట్లు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ నామా కృష్ణయ్య పేర్కొన్నారు.



09

# బియ్యం బస్తాల మాయం!

## వైరా ఏఎంసీలో రేషన్ దందా వెనుక అధికారుల ముఠా!

- నాణ్యత లేని బియ్యానికి ఫుల్ సర్టిఫికేట్!
- పేదల అన్నంలో అవినీతి తుపాన్
- వైరా, మధిర,జూలూరుపాడు బియ్యం మాఫియా బహిర్గతం!

ఖమ్మం జిల్లా వైరా రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌లో బియ్యం బస్తాల అక్రమాలు వెలుగులోకి రావడంతో ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తుతోంది. మధిర నియోజకవర్గంలోని ఓ రైస్ ఇండస్ట్రీస్ నుంచి సరఫరా అయిన 580 బస్తాల్లో కేవలం 186 మాత్రమే అధికారిక రికార్డుల్లో కనిపించగా, మిగతా 394 బస్తాలు మాయమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేదల రేషన్ బియ్యాన్ని రికార్డులపై దిగుమతి చూపించి, నేలమీద మాయం చేయడం వైరా ఏఎంసీలో జరుగుతున్న భయంకర దందాను బయటపెడుతోంది. అధికారులు, మిల్లర్లు, క్వాలిటీ కంట్రోల్ టీమ్ కలిసి కోట్ల రూపాయల అక్రమ సంపాదన చేస్తున్నట్టు ఆధారాలు బయటపడుతున్నాయి.

### వైరా ఏఎంసీ అవినీతి చక్రం

ఒక క్వింటాకు రూ.3,500 చొప్పున లంచాలు, నకిలీ సర్టిఫికేట్లు, రిజిస్టర్లలో వైట్నర్‌తో సాక్ష్యాల చెరపడం, గోప్య ఒప్పందాలు.. ఇవన్నీ వైరా ఏఎంసీ అవినీతి చక్రం ఎంత లోతుగా పాతుకుపోయిందో సూచిస్తున్నాయి. నెలకు కేవలం 10 రోజులు డ్యూటీ చేసిన మహిళా అధికారి కోట్ల రూపాయల విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని ఆరోపణలు రావడం కూడా అధికారులపై అనుమానాల ముసురు కమ్మిస్తోంది.

ఖమ్మం బ్యూరో, మహా



## తస్మాత్ జాగ్రత్త..!

- మైలవరం ఇటుకల మాయాజాలం
- ఆంధ్ర నుంచి నాణ్యత పేరుతో నకిలీ ఇటుకలు
- తెలంగాణలో బహిరంగ దోపిడీ!
- ఇటుక ఒక్కింటికి రూపాయి తక్కువ
- కౌంటింగ్ లో గుట్టుగా మోసం చేస్తున్న వైనం

08



## సమ్మెలో వర్కర్లు

- వంటవాళ్లుగా విద్యార్థులు..!
- గిరిజన వసతిగృహాల్లో దుస్థితి..

05

గిరిజన సంక్షేమ వసతి గృహాలలో పనిచేస్తున్న డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు.గత పది నెలలుగా కనీస వేతనాలు లేకుండా.., జీతాలు రాక పస్తులు ఉంటున్న కార్మికులను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

FOLLOW: @ANNTELUGU
15-10-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# అశ్వారావుపేట బీఆర్ఎస్‌లో చిచ్చు

- మాజీ ఎమ్మెల్యేల మధ్య బహిరంగ ఘర్షణలు
- మూడేళ్లుగా మండల అధ్యక్ష పదవి ఖాళీగా ఉండటం క్యాడర్‌లో చీలికకు దారి
- రాబోయే స్థానిక ఎన్నికల ముందు తారస్థాయికి విభేదాలు
- తిరుగుబాటు తప్పదంటున్న మాజీ ఎమ్మెల్యే



మెచ్చ నాగేశ్వరరావు వర్గం

**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలో అంత ర్గత విభేదాలు ఇప్పుడు బహిరంగ రంగా నికి చేరాయి. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మధ్య చోటుచేసుకున్న ఘర్షణలు ఇప్పుడు కార్యకర్తల్లో అయోమ యాన్ని సృష్టించాయి. ఇద్దరి మధ్య వైఖరులు, తీరులు భిన్నంగా ఉండటంతో పార్టీ శ్రేణులు రెండు వర్గాలుగా విభజమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఇటీవల ప్రెస్‌మీట్ పెట్టి పార్టీలో సీనియర్లకు గౌరవం లేకుండా ఒంటెత్తు పాలన సాగుతోంది అంటూ ఘాటుగా విరుచుకుపడ్డారు. తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా, ట్రైకార్ చైర్మన్‌గా పనిచేసినా, ఎటువంటి ఆహ్వానాలు, సంప్రదింపులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. అదే పరిస్థితి కొనసాగితే తిరుగుబాటుకే వెళతానని స్పష్టంగా హెచ్చరించారు. దీని పై స్పందించిన మెచ్చా నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు లు పార్టీకి వ్యతిరేక వ్యాఖ్యలు సహించబడవు. ఎంతటివారికైనా క్రమశిక్షణా చర్యలు తప్పవు అని హెచ్చరించారు.



తాటి వెంకటేశ్వర్లు వర్గం

### మూడేళ్లుగా మండల అధ్యక్షుడు లేకపోవడం వివాదానికి కేంద్రం

గత ఎన్నికల ముందు ఖాళీ అయిన అశ్వారావుపేట మండల బీఆర్ఎస్ అధ్యక్ష పదవిని ఇప్పటికీ భర్తీ చేయకపోవడం పట్ల కార్యకర్తలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఆ నిర్ణయం ఆలస్యమవ్వడం వర్గపోరుకు దారితీసిన ప్రధాన కారణంగా చర్చించబడుతోంది. ఇటీవల ఆసుపాకలో జరిగిన కార్యకర్తల సమావేశం ఈ విభేదాలకు బలమైన నిదర్శనంగా మారింది. ప్రధాన నాయకులలో పలువురు సమావేశాన్ని బహిష్కరించగా, స్థానిక స్థాయిలో పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. బీఆర్ఎస్ ని స్థాపించడానికి రక్తం చెమట పట్టించిన కార్యకర్తలను పక్కనబెట్టి, తరువాత వచ్చిన వారే ఆధిపత్యం చెలాయిస్తున్నారు అంటూ కొందరు అసంతృప్తిని వ్యక్తం చేశారు.

### విభజన, మహిళా రిజర్వేషన్ భవిష్యత్‌పై ప్రభావం

రాబోయే స్థానిక ఎన్నికలతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లు వంటి అంశాలు కూడా ఈ ప్రాంత రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశముంది. ముఖ్యంగా అశ్వారావుపేట ప్రాంతం ఆంధ్రప్రదేశ్ సరిహద్దుకు సమీపంలో ఉండటంతో, ఇక్కడి పరిణామాలు రెండు రాష్ట్రాల్లోనూ చర్చనీయాంశమవుతున్నాయి. ఇదే సమయంలో, మాజీ నాయకులిద్దరూ తెలుగుదేశం పార్టీకి పూర్వ అనుబంధం ఉన్నవారనే నేపథ్యం మరోసారి చర్చకు దారితీస్తోంది. రాబోయే రాజకీయ సమీకరణల్లో వారిలో ఎవరు ఏ వైపు మొగ్గుతారో అన్నది క్యాడర్‌ను ఉత్కంఠకు గురిచేస్తోంది.

### క్యాడర్‌లో గందరగోళం

ఇప్పటికే అశ్వారావుపేటలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఏ వర్గానికి అండగా నిలవాలి? అనే సందిగ్ధంలో ఉన్నారు. కొందరు ఇద్దరు నాయకులతోనూ సత్సంబంధాలు కొనసాగిస్తూ జాగ్రత్తగా వ్యవహరిస్తుండగా, మరికొందరు పార్టీ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలన్నీ కలిపి చూస్తే.. అశ్వారావుపేట బీఆర్ఎస్‌లో విభేదాలు మరింత ముదురే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అంబులెన్స్‌లోనే కాన్పు

### ములకలపల్లి మండలంలోని చింతంపేట గ్రామంలో ఘటన



**అశ్వారావుపేట, ములకలపల్లి, మహా:** ములకలపల్లి మండలం చింతంపేట గ్రామానికి చెందిన రవ్వా మౌనికకు సోమవారం రాత్రి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆశా కార్యకర్తకు సమాచారం అందించారు. ఆశా కార్యకర్త వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేశారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటి కళాధర్, పైలెట్ రాజా వేగంగా ఘటనాస్థలికి చేరుకుని మౌనికను అంబులెన్స్‌లో ఎక్కించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు తీవ్రమవడంతో అంబులెన్స్‌ను రహదారిపక్కన నిలిపి, 108 సిబ్బంది తమ ప్రావీణ్యంతో అంబులెన్స్‌లోనే కాన్పు నిర్వహించారు. రవ్వా మౌనిక పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది ఈఎంటి కళాధర్, పైలెట్ రాజా తెలిపారు. అనంతరం వారిని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. 108 సిబ్బంది వేగవంతమైన స్పందనకు రవ్వా మౌనిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## శిథిలమైన పొగాకు బేరన్



**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట మండలం వినాయకపురం గ్రామంలో సిదిలమై ఉన్న పొగాకు బేరన్ ఇప్పుడు ప్రాణాంతకంగా మారింది. గోడలు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బేరన్ చుట్టూ పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో విష సర్పాలకు నిలయంగా మారింది. పగలు చిన్న పిల్లలు ఇక్కడ ఆడుతుంటారు. ఎప్పుడెప్పుడు ఈ కట్టడం పూర్తిగా కూలిపోతుందో అని భయం వేస్తోంది, అని గిరిజన మహిళా నరం సుబ్బలక్ష్మి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెక్రటరీకి ఎన్నిసార్లు చెప్పినా నేను ఏమి చేయలేను అనే సమాధానమే వస్తోందని అసహనం వ్యక్తం చేశారు. తమకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు? అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి ఈ సిదిలమైన భవనాన్ని కూల్చి ప్రదేశాన్ని శుభ్రపరచాలని, ప్రజల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లకముందే తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణ రాష్ట్ర మహిళా ఫుట్ బాల్ జట్టుకి బూర్గంపహాడ్ యువతి



**బూర్గంపహాడ్ మహా:** బూర్గంపహాడ్ గ్రామం లో నివాసం ఉండే మేక పున్నం గారి కుమార్తె మేక సృజన (17) తెలంగాణ రాష్ట్ర మహిళా ఫుట్ బాల్ జట్టుకి ఎంపిక అవ్వటం జరిగింది, ఆటల్లో తనకున్న నైపుణ్యంతో మన గ్రామ యువతి రాష్ట్ర స్థాయిలో ఎంపిక అవ్వటం గర్వించదగిన విషయం..ఇలాంటి (నిరుపేద ఇంటి బిడ్డ) ఇంకా ఉన్నత స్థాయిలో రానిస్తూ మన రాష్ట్ర స్థాయి నుండి దేశ స్థాయికి వెళ్ళి ఆడాలని, గ్రామం,మండలం,జిల్లా పేరు దేశ వ్యాప్తంగా గొప్ప స్థాయిలో వినిపించేలా చేయాలని బూర్గంపహాడ్ మండల ప్రజలు మనసారా కోరుకుంటున్నారు

## అక్టోబర్ 16న జాబ్ మేళా నిర్వహణ

**ఖమ్మం,మహా:** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం ఖమ్మం రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ లో ఉద్యోగాలు కల్పించుటకు అక్టోబర్ 16న గురువారం ఉదయం 10.00 గంటలకు గాంధీ చౌక్ లోని కోటక్ మహేంద్ర బ్యాంక్ పైన గల రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్, ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం తెలిపారు. రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ లో సేల్స్ మేనేజర్ పోస్టులకు ఏదేని డిగ్రీ అర్హత గల 25 నుండి 40 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 25 వేల నుండి 40 వేల వరకు ఉంటుందని అన్నారు. మొత్తం 10 ఉద్యోగాల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు అర్హత గల యువతీ, యువకులు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారి పేర్కొన్నారు.

## పత్తి రైతులను నిండా ముంచిన అతివృష్టి



**టేకులపల్లి - మహా:** ఆరుకాలం కష్టపడ్డ రైతు తీరా పంట చేతికి వచ్చే సమయానికి అతి భారీ వర్షాలు కురిసి పత్తి రైతులను మండల వ్యాప్తంగా నిండా ముంచింది రైతులు పెట్టిన పెట్టుబడి రాని పరిస్థితులలో ఎండకు ఎండి వానికి తడిసి పంట చేన్లను సాగు చేస్తే తక్కువ వర్షపాతం కురిసిన నష్టమే అతి ఎక్కువ వర్షపాతం ఉన్న రైతులకు నష్టమే టేకులపల్లి మండల వ్యాప్తంగా రైతన్నలు తలలు పట్టుకుని పరిస్థితులు దీనిపైన ప్రభుత్వం స్పందించి రైతన్నలకు క్వింటా పత్తి 15 వేలకు కొనుగోలు చేసి రైతన్నలను ఆదుకోవాలని రైతులు తమ గోడు వినిపిస్తున్నస్తున్నారు.

## గుర్వయ్య పార్థివ దేహానికి నివాళులు



**కూసుమంచి, మహా:** కూసుమంచి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లికొండ శ్రీను, మాజీ మండల పరిషత్ అధ్యక్షురాలు బొల్లికొండ పుష్పలత మామ అయిన బోల్లికొండ గుర్వయ్య మంగళవారం ఉదయం అనారోగ్య కారణంగా మరణించారు. ఈ విషయం తెలుసుకున్న కూసుమంచి మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు వారి స్వగృహం చేగొమ్మ గ్రామానికి వెళ్లి వారి పార్థివ దేహంపై పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. బొల్లికొండ శ్రీను-పుష్పలత లను పరామర్శించారు. మనో ధైర్యాన్ని కల్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మొహమ్మద్ హాఫీజుద్దీన్, టి.పి.సి.సి అధికార ప్రతినిధి కొరివి వెంకటరత్నం, చేగొమ్మ మాజీ సర్పంచ్ బొల్లికొండ బ్రహ్మయ్య, బానోత్ పీర్యా నాయక్, బెల్లంకొండ వెంకన్న, గుండా విజయపాల్ రెడ్డి, సాజీద్ పాషా, బెల్లంకొండ కిరణ్, గుండా భూపాల్ రెడ్డి, అంతోటి వెంకన్న గుండా లింగా రెడ్డి, షేక్ నాగుల్ మీరా, రాములు నాయక్, లచ్చు నాయక్ భారీ యాదగిరి, తదితరులు పాల్గొని సంతాపం ప్రకటించారు.

## మెదక్ ఐసిఎంఎల్‌లో ఉద్యోగావకాశాలు



**మణుగూరు, మహా:** గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ఐటిడిఏ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా గండుపల్లి గ్రామంలోని ఇంటిగ్రేటెడ్ కన్స్యూమర్ గూడ్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ అండ్ లాజిస్టిక్స్ (ఐసిఎంఎల్) సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా అదనపు పౌర సంబంధాల అధికారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్ మేళా ఈ నెల 15వ తేదీన మణుగూరు ఐటిఐ ఆవరణలో జరగనుందని ఆయన పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, వృత్తి విద్య లేదా ఐటిఐ పూర్తిచేసి, వయస్సు 18 నుండి 29 సంవత్సరాల మధ్య ఉన్న అభ్యర్థులు మిషన్ ఆపరేటర్ పోస్టులకు అర్హులని తెలిపారు. ముఖ్యంగా గిరిజన మహిళలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, మొత్తం 40 పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు. గిరిజన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులు మెదక్ జిల్లాలోని ఐసిఎంఎల్ యూనిట్‌లో పనిచేయాల్సి ఉంటుందని పిఓ రాహుల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మణుగూరు ఐటిఐ ప్రిన్సిపల్ ఎం శ్రీనివాస్, ఫ్యాకల్టీ సభ్యులు కె అనిల్, డి ప్రియాంక, ఎస్ రాజు, గిరిజన అభ్యర్థులు పొనుగోటి సుజాత, తుమ్మల సాయి కుమార్, కోట్ల రమేశ్, సావళి రమ్య, బుట్టు అనిల్, గుర్రం సరోజ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణ సాగర్‌లో లేని బస్సు షెల్టర్

- నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకులు
- వృధాగా పోతున్న నీరు... కుళ్లుతున్న చెత్త
- అధికారులకు తెలియజేసిన ఫలితం శూన్యం
- మందుబాబులకు అడ్డాగా మారిన వాటర్ ట్యాంక్
- బస్ షెల్టర్, గ్రంథాలయం లాంటివి నిర్మిస్తే స్థానిక ప్రజలకు మేలు



**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం పరిధిలో ఉన్నటువంటి కృష్ణసాగర్ గ్రామంలో వర్షాకాలం, ఎండాకాలం, బస్ షెల్టర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణ సాగర్ లో నిరుపయోగంగా ఉన్న రింగుల వరలతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకులను నాలుగు తొలగించారు మరొక వాటర్ ట్యాంక్‌ను మరిచారు కృష్ణ సాగర్‌లో ప్రతి ఇంటికి మిషన్ భగీరథ పైపుల ద్వారా పంచాయతీ పైపుల ద్వారా, కృష్ణ సాగర్ లో నిర్మించిన అతిపెద్ద వాటర్ ట్యాంక్ ద్వారా నీటి సదుపాయం అందుతుంది అనడంలో సందేహమే లేదు అదేవిధంగా నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ లో ఉన్న నీటిని ఎవరు ఉపయోగించడం లేదు? నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకులు రోడ్డుకు సమీపంలో ఉన్నందున బస్ షెల్టర్, గ్రంథాలయం నిర్మించినట్లయితే స్థానికులకు ఉపయోగ కరంగా ఉంటుంది అంటున్న స్థానిక ప్రజలు.. అధికారులు గమనించి మందుబాబులకు అడ్డాగా ఉన్న వాటర్ ట్యాంకులను తొలగించి ఆ ప్రాంతంలో ప్రజలకు ఉపయోగకరంగా కార్యచరణ దాల్చాలని కోరుకుం టున్న స్థానిక ప్రజలు..

# ఆటో కార్మికుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**మణుగూరు, మహా:** ఆటో కార్మికులు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం తగిన సహాయం అందించడం లేదని సిపిఐ రాష్ట్ర నాయకుడు సరే అండి పుల్లారెడ్డి అన్నారు. మణుగూరులోని సీపీఐ పార్టీ కార్యాలయంలో సురక్ష బస్టాండ్ ఆటో ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో తీవ్రంగా నష్టపోతున్నారని, రోజువారీ ఆదాయం తక్కువగా ఉండటంతో కుటుంబ పోషణ కష్టమైపోతోందని తెలిపారు. ప్రభుత్వము ఆటో కార్మికుల కోసం బీమా పథకాలు, ఆరోగ్య సదుపాయాలు, వృద్ధాప్య పింఛన్ వంటి రక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే ఆటో స్టాండ్లకు శాశ్వత స్థలాలు, పార్కింగ్ సౌకర్యాలు కల్పించి, పోలీస్ విభాగం అనవసరంగా వేధించడం ఆపాలని కోరారు. ఆటో వర్కర్లకు ఇంధన సబ్సిడీ ఇవ్వడం ద్వారా కొంత ఉపశమనం లభిస్తుందని పుల్లారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు, రాయల భిక్షం గద్దం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు,పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్,మ్యాజిక్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు చారి,సిరిగడే సతీష్, కొత్తపల్లి సత్యనారాయణ,ప్రసాద్,శంకర్ లు పాల్గొన్నారు. ఆటో యూనియన్ సురక్ష బస్టాండ్ అడ్డ ఏఐటీయూసి యూనియన్ అధ్యక్షులుగా ఎన్ఎన్ రాజు, కార్యదర్శిగా మందారి పుల్లయ గౌరవ అధ్యక్షులుగా చారిలను ఎనుకున్నారు.

# చారిత్రిక సభకు సన్నద్ధం కండి

- గ్రామ గ్రామాన ప్రచారం
- భారీ జన సమీకరణ
- బి.సి. రిజర్వేషన్లపై దొంగాట తగదు
- సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని




ఖమ్మం, మహా: భారత కమ్యూనిస్టుపార్టీ సి.పి.ఐ శత వసంత ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న జరిగే చారిత్రక సభకు పార్టీశ్రేణులను సన్నద్ధం చేయాలని సి.పి.ఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు నిచ్చారు. ఖమ్మం బహిరంగసభ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక మైలు రాయిగా నిలిచి పోనున్నదని ఆయన తెలిపారు. సి.పి. ఐ జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్భవన్లో జరిగింది. కర్నాటి భానుప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో కమ్యూనిస్టుపార్టీకి ఒక ప్రత్యేక స్థానం ఉందని స్వాతంత్ర ఉద్యమం సందర్భంగా సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టుపార్టీ మాత్రమేనన్నారు. స్వాతంత్ర్య అనంతరం భారతదేశపు నడిబొడ్డున స్వంతంత్ర రాజుగా ప్రకటించుకున్న నిజాం రాజరికాన్ని కూలదోసి రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేసేందుకు మహత్తర తెలంగాణ పోరాటాన్ని నిర్వహించింది కూడా కమ్యూనిస్టులేనని సాంబశివరావు తెలిపారు. స్వాతంత్ర్య అనంతరం ప్రజల హక్కుల కోసం, సంక్షేమం కోసం బహుముఖ పోరాటాలు నిర్వహించి పోరాట విజయాలను సాధించిందని, భూమి విలువలు గుర్తించి దున్నేవానికి భూమిదక్కాలని చారిత్రక పోరాటాలు నిర్వహించిందన్నారు. 100 పోరాట చరిత్రను, త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు శత వసంత సంబరాల ముగింపు వేడుకలను ఖమ్మంలో అత్యంత ఘనంగా నిర్వహించాలని సి.పి.ఐ నిర్ణయించిందన్నారు. లక్షలాది మందితో బహిరంగసభ జరుగుతుందని ఈ సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు హాజరు కానున్నారని సాంబశివరావు తెలిపారు. బహిరంగసభ, ప్రదర్శనకు సంబంధించి గ్రామగ్రామాన ఇంటింటికీ ప్రచారం నిర్వహించాలని ఆయన కోరారు. బహిరంగసభను పురస్కరించుకొని సభలు, సమావేశాలు, సెమినార్లు నిర్వహించడంతపాటు ప్రత్యేక కళారూపాలను రూపొందించాలని ఆయన కోరారు. పార్టీ వందేళ్ళ చరిత్ర సమకాలీన రాజకీయాలు, ఆర్థిక, సామాజిక పరిస్థితులను వివరిస్తూ ప్రచారం నిర్వహించాలన్నారు.

### బి.సి. రిజర్వేషన్లపై దొంగాట

రాష్ట్రంలో బి.సి. రిజర్వేషన్ల కొన్ని రాజకీయ పార్టీలు దొంగాట అడుతున్నాయని సాంబశివరావు ఆరోపించారు. మద్దతు ప్రకటిస్తూనే మరోపక్క రిజర్వేషన్లను అడ్డుకొనే ప్రయత్నం చేస్తున్నాయని ఆయన తెలిపారు. బి.సి. రిజర్వేషన్ల అమలుకు సి.పి.ఐ కట్టుబడి ఉన్నదని బి.సి.లకు 42 శాతం అమలుకోసం జరిగే పోరాటాలకు సి.పి.ఐ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. బీజేపీ బి.సి. వ్యతిరేకిగా చరిత్రలో నిలిచి పోతుందన్నారు. 18 మాసాలుగా ఉద్యోగ విరమణ చేసిన వారికి రావల్సిన ఆర్థిక మొత్తాలను ప్రభుత్వం అందించడం లేదని తక్షణం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షనర్లు చేపట్టే ఆందోళనకు సి.పి.ఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. ఈ సమావేశంలో సి.పి.ఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్ మహ్మదౌమౌలాన, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి పాల్గొన్నారు.

## యశోద హాస్పిటల్స్‌లో అధునాతన బ్రాంకో స్కోపిక్ వైద్య సేవలు



కొత్తగూడెం టౌన్, మహా: అధునాతన టెక్నాల జీ పరికరాలతో యశోద హాస్పిటల్ లో వైద్యం అందించడం జరుగుతుందని హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్ బృందం పేర్కొంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నివాసి శ్యామల రేణుక అనే 54 ఏళ్ల పేషెంట్ కు హెమో ప్టిసిస్‌తో ఎడమ ఊపిరితిత్తుల పనితీరు ఆగిపోయిన నేపథ్యంలో అరుదైన సంక్లిష్టమైన వైద్యాన్ని హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్స్ లో అందించి ఊపిరితిత్తులు పని చేసే విధంగా చేయడం జరిగిందని తెలిపారు. దీనికి సంబందించిన వివరాలను కొత్తగూడెం శ్రీ కృష్ణ ఇన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇంటర్నేషనల్ పల్మోనాలజీ అండ్ స్లీప్ మెడిసిన్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ కిషన్ శ్రీకాంత్ జువ్వా మాట్లాడుతూ పేషెంట్కు తీవ్రమైన జ్వరం, శ్వాస ఆడకపోవడం, కఫంతో దగ్గు పది రోజులకు పైగా హెమోప్టిస్ సమస్య ఉన్నాయని తమ ఆసుపత్రిలో చేరిన తర్వాత ఛాతీ ఎక్స్-రే, అల్ట్రాసౌండ్, సీటి థొరాసిక్ యాంజియోగ్రఫీతో సహా వివరణాత్మక వైద్య పరీక్షలు తేలికపాటి చేయగా ప్లూరల్ పెరికార్డియల్ ఎఫ్యూషన్తో ఎడను ఊపిరితిత్తులు పూర్తిగా పనితీరు ఆగిపోయి, దీర్ఘకాలిక వ్యాధుల వలన రక్తహీనత తీవ్రమైన మూత్రపిండాల గాయం వలన పేషెంట్ పరిస్థితి మరింత క్లిష్టంగా మారినట్టు గుర్తించామని చెప్పారు. క్రయో అడెషన్ టెక్నాలజీని ఉపయోగించి బ్రోంకోస్కోపీని నిర్వహించి ట్రాకియో బ్రోన్సియల్ ఫ్రీను అడ్డుకునే పెద్ద గడ్డలు స్రావాలను తొలగించి, ఊపిరితిత్తులు విజయవంతంగా తిరిగి విస్తరించడానికి వీలు కల్పించామన్నారు.

## మోడల్ కాలనీలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్ నాగరాజు



అశ్వారావుపేట, మహా : అశ్వారావుపేట మున్సిపల్ కమిషనర్ నాగరాజు మంగళవారం మోడల్ కాలనీలో పర్యటించారు. కాలనీలో జరుగుతున్న సిసి రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పనుల నాణ్యతను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మోడల్ కాలనీలో నీటి సరఫరా సమస్యతో పాటు వీధి లైట్లు, పరిశుభ్రత వంటి సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రతిరోజూ వచ్చే చెత్త బండిలో తడి చెత్త, పొడి చెత్తను వేరుగా ఇవ్వాలని కాలనీవాసులను సూచించారు. ఖాళీ స్థలాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అవి చెత్త మురికికి నిలయాలుగా మారకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తర్వాత కమిషనర్ పల్లె దవాఖానా, అంగన్వాడి కేంద్రం, స్కూల్‌లను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. చుట్టుపక్కల ప్రాంగణం ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుభ్రత%–%పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహించాలి, అని అధికారులకు సూచించారు. అంగన్వాడి కేంద్రంలో విద్యార్థుల సంఖ్య, వారికి అందజేస్తున్న పోషకాహారం గురించి విచారించారు. పిల్లల ఆహారంలో మునగాకు, ఆకుకూరలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. గర్భిణీలకు, చిన్న పిల్లలకు ఆరోగ్యపరమైన సలహాలు ఇవ్వడమే కాకుండా, పౌష్టికాహార కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. మోడల్ కాలనీని అన్ని మౌలిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడమే లక్ష్యమని కమిషనర్ నాగరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిండా హరిబాబు, తగరం ముత్తయ్య, నార్లపాటి కాంతారావు, నార్లపాటి దివాకర్ తో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులకు ప్రతిభ పురష్కారాలు..



ఖమ్మం, మహా: 2024 –25 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం మరియు నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు సేవా పతకాలలో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అందించిన అత్యుత్తమ సేవలకు గాను పలువురు పోలీస్ సిబ్బందికి పతకాలు లభించాయి. పతకాలు పొందిన వారిలో అడిషనల్ డీసీపీ ప్రసాద్ రావు, టౌన్ ఏసీపీ రమణమూర్తి, సిసిఆర్బీ ఏసీపీ సాంబరాజు,తో పాటు పోలీస్ సిబ్బంది వున్నారు. మహెూన్నత సేవ పతకం (01) ఉత్తమ సేవ పతకం (05) సేవ పతకం (64) ఉత్కృష్ట పతకాలు (12) సాధించారు. ఈ నేపథ్యంలో మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా 82 మంది పోలీస్ సిబ్బందికి పతకాలు అందజేసి అభినందించారు. ఇదే స్పూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## ఆశ్రమ స్కూల్ ముందు డైలీ వేజ్ వర్కర్ల ధర్నా



కారేపల్లి, మహా: తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల డైలీ వేజ్, కాంటినెంట్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని మేకల తండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. మండలంలోని వివిధ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లంతా ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొని నిరసన తెలిపారు. ప్రభుత్వం సమస్యను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ... డైలీ వేజ్ వర్కర్లంతా 34 రోజులుగా సమ్మె చేస్తూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్కర్లకు వేతనాలు పెంచాల్సింది పోయి ఉన్న వేతనాల్లో కోతలు విధించడం అన్యాయమని అన్నారు. గతంలో ఇచ్చిన విధంగా రోజువారి వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రోజువారి వేతనం తగ్గించి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. డైలీ వైస్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.

## కె ఓసి ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఉచిత శిక్షణ



టేకులపల్లి మహా: కోయగూడెం ఓసి ప్రభావిత ప్రాంతాలు దారపాడు కొత్తూరు కిష్టారం లచ్చగూడెం బోడు కొత్తగూడెం ప్రాంత ప్రజలకు సింగరేణి సేవా సమితి దొర ఉచిత వృత్తి శిక్షణ దరఖాస్తుల ఆహ్వానం టేకులపల్లి లోని సింగరేణి కాలనీ సి ఆర్ క్లబ్ నందు నందు ఉచిత శిక్షణ టైలరింగ్ మగ్గం బ్యూటిషన్ ఇవ్వబడునని ఇల్లందు ఏరియా మేనేజర్ వి కృష్ణయ్య తెలిపారు దరఖాస్తు 16 తారీకు అక్టోబర్ లోపు జీఎం కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు

## సమ్మెలో వర్కర్లు



**మణుగూరు, మహా:** గిరిజన సంక్షేమ వసతి గృహాలలో పనిచేస్తున్న డైలీ వేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. గత పది నెలలుగా కనీస వేతనాలు లేకుండా.., జీతాలు రాక పస్తులు ఉంటున్న కార్మికులను ప్రభుత్వం గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు భారత విద్యార్థి ఫెడరేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మణుగూరు కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మాదాస్ అఖిల్ మాట్లాడుతూ.. గత 20 రోజులుగా కార్మికులు సమ్మెలో ఉండటంతో ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు పస్తులు ఉంటున్నారన్నారు. వంటవారే లేక విద్యార్థులు వంట తామే చేసుకుంటున్న పరిస్థితి నెలకొందని, ఇది చాలా బాధాకరమన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వర్కర్ల జీతాలు విడుదల చేయాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, విధి నిర్వహణలో ప్రమాదం జరిగితే కుటుంబ సభ్యులకు ఉద్యోగంతో పాటు రూ.50 వేల ఆర్థిక సాయం, హెల్త్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలు జరపకపోతే విద్యార్థులతో కలిసి ఐటిడిఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు రాము, ప్రేమ్, కిరణ్, మోహన్ సాయి, తరుణ్, చరణ్, కౌశిక్, రోహిత్, తేజ, హరీష్, లక్ష్మీ నరసింహ, జ్యోతిష్, అనురూప్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌ను కలిసిన ప్రెస్ క్లబ్ సభ్యులు



**చింతకాని,మహా:** మంగళవారం నాడు చింతకాని మండల ప్రెస్ క్లబ్ సభ్యులు తసీల్దార్ బాబ్జీ ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు.తాసిల్దార్ బాబ్జీ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఉన్న సమస్యల గురించి పత్రికలలో కథనాలు రాసి ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి వార్తలతో పత్రిక విలువలు కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు జొన్నలగడ్డ మల్లేశ్వరి,కార్యదర్శి వెన్నబోయిన సురేంద్ర బాబు,సలహాదారుడు గండరపు రామారావు,శెట్టి సురేష్,పిచ్చయ్య,జొన్నలగడ్డ సందీప్ రెడ్డి,గుండ్ల రాంబాబు,రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కట్టుదిట్టంగా అమలు చేయాలి



**ఖమ్మం,మహా:** క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కట్టుదిట్టంగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్ యాక్ట్ క్రింద జిల్లాలో అనుమతులు, రెన్యువల్స్ కోసం వచ్చిన దరఖాస్తులలో ఆమోదించినవి, తిరస్కరించిన, పెండింగ్ లో ఉన్న వాటిపై వైద్య అధికారులతో సమీక్షించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలని అన్నారు. ఆసుపత్రులను సీజ్ చేసిన తర్వాత కోర్టులలో పెండింగ్ ఉన్న కేసులలో సరైన ఆధారాలతో కౌంటర్ దాఖలు చేయాలని అధికారులకు తెలిపారు. కౌంటర్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించి, సిపి, లా అండ్ ఆర్డర్ డిసిపి అభిప్రాయం తీసుకుని పక్కాగా ఉండేలా దాఖలు చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన పరికరాల కొనుగోలు నిబంధనల ప్రకారం జరగాలని, పరికరాలను నేరుగా నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలని, పెద్ద యంత్రాలు కొనుగోలు ఈ ప్రొక్యూర్ మెంట్ చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ అదనపు డీసీపీ ప్రసాదరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి, డిప్యూటీ డి.ఎం అండ్ హెచ్ఓ డాక్టర్ చందునాయక్, ఐఎంఏ అధ్యక్షులు డా. రెహానా బేగం, ప్రోగ్రాం అధికారులు వెంకట రమణ, రామారావు, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. నరేందర్, డి.సి.హెచ్.ఎస్. డా. రాజశేఖర్ గౌడ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరుగురు నిషేధిత మావోయిస్టులు లొంగుబాటు



**భద్రాద్రి బ్యూరో, మహా:** నిషేదిత మావోయిస్టు పార్టీకి చెందిన ఆరుగురు సభ్యులు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు సిఆర్పిఎఫ్ టెటాలియన్ అధికారులు ఆదివాసీ ప్రజల అభివృద్ధి సంక్షేమం కొరకు నిర్వహిస్తున్న "ఆపరేషన్ చేయూత" కార్యక్రమం ద్వారా లొంగిపోయిన సభ్యులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ కల్పిస్తున్న సదుపాయల గురించి తెలుసుకుని అనేకమంది లొంగిపోయేందుకు ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. దీనిలో భాగంగానే ఆరుగురు సభ్యులైన కుంజం పాపారావు, లేఖం బండి, మడ్వి కోస, పద్దం లక్మ, మాధవి లక్మ, దొడ్డి బుద్రులు స్వచ్ఛందంగా లొంగిపోయినట్లుగా వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు నిర్వహిస్తున్న ఆపరేషన్ చేయూతా కార్యక్రమం ద్వారా ఈ సంవత్సరం జనవరి జనవరి నుండి తాజాగా లొంగిపోయిన వారితో కలిపి మొత్తం 326 మంది లొంగిపోయినట్లుగా చెప్పారు. వీరికి పునరావాస సౌకర్యాలను కల్పించడం జరిగిందన్నారు. పునరావాసంలో భాగంగా వీరికి తెలంగాణ ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికీ లొంగిపోయిన రోజునే 20 లక్షల రూపాయలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్ట్ పార్టీ సభ్యులు లొంగిపోయి శాంతియుత జీవనం గడపాలని తెలంగాణ ప్రభుత్వం పోలీస్ శాఖ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం పోలీసు శాఖ ఆదివాసీల అభివృద్ధి సంక్షేమం కొరకు కృషి చేస్తుందన్నారు. ఆదివాసి ప్రాంతాలలో రోడ్లు, పాఠశాలలు, వైద్యశాలలు, తాగునీరు విద్యుత్తు సౌకర్యాలు చాలా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రతి మారుమూల గిరిజన ప్రాంతానికి నాణ్యమైన విద్య వైద్య సౌకర్యాలు కల్పించడానికి పోలీసు శాఖ కృషి చేస్తుందన్నారు. భయంతోనో మావోయిస్టు పార్టీకి ఎంత సహకరించినా మీ ఆదివాసీ ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవని తెలిపారు. కేవలం ప్రజాస్వామ్య ప్రభుత్వాల ద్వారా మాత్రమే అభివృద్ధి జరుగుతుందని ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు.

## సింగరేణి ఏరియా ఆసుపత్రిలో వైద్య సిబ్బందిని నియమించాలి



**మణుగూరు, మహా :** మణుగూరు సింగరేణి ఏరియా ఆసుపత్రిలో తక్షణమే వైద్య సిబ్బంది నియమించి, సరైన వైద్య సౌకర్యాలు కల్పించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నేతలు డిమాండ్ చేశారు. హాస్పిటల్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మణుగూరు ఏరియా హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించి, డీవైసీఎంఓ జ్యోతిర్మయికి మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్ మాట్లాడుతూ.. మణుగూరు సింగరేణి హాస్పిటల్‌లో తగిన వైద్య సౌకర్యాలు లేక కార్మికులు, వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా గైనకాలజిస్టులు, పిల్లల వైద్యులు లేక గర్భిణీ స్త్రీలు, చిన్నపిల్లలు తీవ్ర కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భవతులు 70 కిలోమీటర్లు ప్రయాణించి కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోందని. కొంతమంది ప్రాణాపాయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, ఇది అత్యంత దురదృష్టకరమైందన్నారు. మణుగూరు ఏరియా ఆసుపత్రి కేవలం ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌గా మారిందని.. సరైన మందులు, సౌకర్యాలు కల్పించకుండా కార్మికుల ప్రాణాలతో ఆటలు ఆడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మణుగూరు ఏరియా సింగరేణికి అధిక ఆదాయం తెచ్చిపెడుతోందని, అలాంటి ప్రాంతంలో వైద్య సౌకర్యాల లేమి సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం వెంటనే స్పందించి గైనకాలజిస్టు, పిల్లల వైద్యులను నియమించాలని, సరైన మెడిసిన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ ఎం.వి. రామనరసయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ కామ్రేడ్ మేకల ఈశ్వరరావు, సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు దాట్ల సందీప్, పిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, సాయి ప్రకాష్ చారి, బి. రవికుమార్, శ్రీనివాసరావు, అంతోని రవి, గోపాల్ రావు పాల్గొన్నారు.

# కారు ఇంజన్లో గంజాయి స్మగ్లింగ్..!



**భద్రాద్రి బ్యూరో, మహా:** గంజాయిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేందుకు మాఫియా ముఠా ఎంతకైనా తెగిస్తున్న పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వివిధ రకాల పద్ధతుల్లో గంజాయిని సరఫరా చేసేందుకు ముఠా విశ్వ ప్రయత్నాలు చేస్తూ కొందరు దొరికి కొందరు దొరకక పోవడం వల్ల గంజాయి దందా విస్తరిస్తుంది తప్ప పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడని పరిస్థితులు నెలకొన్నాయని పలువురు చర్చించుకోవడం విమర్శలకు తావిస్తుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం వేపలగడ్డ ప్రాంతంలో కంటైనర్ లారీలో సుమారు రెండు కోట్ల 50 లక్షల రూపాయల విలువచేసే రవాణా జరుగుతున్న గంజాయిని సోమవారం సుజాతనగర్ పోలీసులు పట్టుకున్న విషయం పాఠకులకు విధితమే. ఇది జరిగి ఒక్కరోజు కూడా గడవకముందే పాల్వంచ ప్రాంతంలో గంజాయి ప్యాకెట్లు దొరకడం చర్చనీయాంశంగా మారింది. కారు ఇంజన్లో గంజాయి ప్యాకెట్లు రవాణా జరుగుతున్న సమయంలో ఇంజన్ వేడికి గంజాయి ప్యాకెట్లు దగ్ధమయ్యాయి. మంటలను అదుపు చేయించేందుకు కారును మాఫియా ముఠా మంగళవారం పాల్వంచలోని ఒక సర్వీసింగ్ సెంటర్ కు తరలించి మంటలు అదుపు చేసే క్రమంలో ఇంజన్ డోర్ ఓపెన్ చేయగా కాలుతున్న గంజాయి ప్యాకెట్లు చూసి అక్కడున్న స్థానికులు కంగుతున్నారు. విషయాన్ని పోలీసులకు సమాచారం చేరవేయడంతో అప్రమత్తమైన గంజాయి స్మగ్లర్లు అక్కడే కారును వదిలి పరారయ్యారు. పోలీసులు గంజాయితో ఉన్న కారును పోలీస్ స్టేషన్కు తరలించారు. నిషేధిత గంజాయిని రవాణా చేస్తున్న పరారైన ముఠాలో ఒక మహిళ ఉన్నట్లుగా ప్రచారం జరుగుతుంది. గంజాయి ముఠా కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి సమాచారం కోసం ఆరా తీసే పనిలో నిమగ్నమయ్యారు. ఏది ఏమైనా భద్రాద్రి జిల్లా కేంద్రంలోని భారీ గంజాయి పట్టు పడడం చూస్తే కలవరపెడుతున్న పరిస్థితి నెలకొంది.

## హైస్కూల్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి



**ముదిగొండ, మహా:** పాఠశాలలోనే ఉన్న సమస్యలతోపాటు,స్కూల్లో నూతన భవనాన్ని నిర్మాణం చేపట్టి మధ్యలోనే అసంపూర్తిగా వదిలేసిన పాఠశాల భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల యడవల్లి హైస్కూల్ ఎదుట ఉన్న రహదారిపై టెంట్ వేసి మంగళవారం విద్యార్థిని,విద్యార్థులు, తల్లిదండ్రులు,గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులు కావాలే,కావాలి హైస్కూల్ భవనం కావాలే అనే నినాదాలు చేశారు.మనబడి మన ఊరు పథకంలో గత ప్రభుత్వ హయాంలో హైస్కూల్ భవన నిర్మాణాన్ని చేపట్టారు.నిధులు మంజూరు కాక మధ్యలోనే భవనాన్ని కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు.పాఠశాలలో విద్యార్థులకు తరగతి గదులు సరిపోక ఇరుకు గదుల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలు,అర్ధంకాక ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని పాఠశాలలో అసంపూర్తిగా నిర్మాణం చేసిన భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థులు,తల్లిదండ్రులు గ్రామస్తులు కోరారు.

## పిల్లల సామర్థ్యాల పెంపుదలలో ఉపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషించాలి




**భద్రాద్రి బ్యూరో, మహా:** పిల్లల సామర్థ్యాల పెంపుదలలో ప్రధాన ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సూచించారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో మంగళవారం జరిగిన ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి తన బాధ్యత అని పిల్లల సామర్థ్యాల పెంపుదల కోసం కృషి చేసేటట్లుగా ఉపాధ్యాయులను ఉత్తేజ పరచడం ప్రధానోపాధ్యాయుల బాధ్యత అని దీనిని విస్మరిస్తే విద్యార్థుల ప్రగతి అగమ్య గోచరం అవుతుందని అన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల సమాచారం యు డేస్ లో వాస్తవ స్థితి ప్రతిబింబించేటట్లుగా నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులు తమ బోధన సామర్థ్యాలు మెరుగుపరచుకునేటట్లుగా నిరంతరం ఉపాధ్యాయుల ప్రోత్సహిస్తూ ఉన్నతమైన ఫలితాలు తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. మౌలిక భాష గణిత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పాఠశాల పర్యవేక్షణ బలోపేతం చేసుకుంటూ ఉపాధ్యాయులకు మంచి సూచనలు సలహాలు ఇస్తూ వారిని ప్రోత్సహించి పిల్లల సామర్థ్యాలు మెరుగుపడేటట్లుగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్, సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్కే. సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్. మాధవరావు, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగ కార్యదర్శి బి.నీరజ, జిల్లా ఫైనాన్స్ అధికారి ఏ.జగన్, సి.ఎస్.ఎఫ్ బృంద నాయకుడు నందకిషోర్, అన్ని మండలాల మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## మణుగూరు పోలీస్ స్టేషన్‌కు జిల్లా ఎస్పీ



**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆకస్మికంగా సందర్శించారు. మంగళవారం మధ్యాహ్నం మణుగూరు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీ, సుమారు గంటపాటు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ముఖభావాలు చూస్తే కొంత ఆగ్రహంగా ఉన్నట్లు సమచారం. గత కొంతకాలంగా మణుగూరు పోలీస్‌స్టేషన్‌పై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి ఇప్పటివరకు ఇద్దరు అధికారులు ఏసీబీ ట్రాప్‌లో చిక్కడం, తాజాగా స్టేషన్‌లోనే ఇసుక నిర్వాహకుడు రైతుపై దాడి చేసిన ఘటన, వారంరోజుల వ్యవధిలో నలుగురు కానిస్టేబుళ్లను పలు ఆరోపణలపై జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎస్పీ రోహిత్ రాజ్ ఆకస్మికంగా స్టేషన్‌ను సందర్శించి, పలు రికార్డులను పరిశీలించినట్లు సమాచారం. విధుల్లో నిర్లక్ష్యం, క్రమశిక్షణా లోపం విషయంలో ఎస్పీ రోహిత్ రాజ్ అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. మణుగూరు పోలీస్‌స్టేషన్‌పై కొనసాగుతున్న ఆరోపణల నేపథ్యంలో ఎస్పీ ఈ ఆకస్మిక పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. జిల్లాలో పోలీస్‌శాఖ ప్రతిష్ఠ దెబ్బతినకూడదనే ఉద్దేశ్యంతో ఎస్పీ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని సమాచారం. సమావేశంలో మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, సీఐ నాగబాబు, ఎస్సై నగేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిల్లలను బయటకు పంపితే కఠిన చర్యలు

**ఖమ్మం,మహా:** బకాయిల కోసం తరగతి గదుల నుంచి పిల్లలను బయటకు పంపితే కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర డిప్యూటీ సిఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రాష్ట్ర డిప్యూటీ సీఎం మంగళవారం హైదరాబాద్ నుంచి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకంపై, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర రాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో సమావేశంలో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం క్రింద ప్రైవేటు పాఠశాల యజమానులు వారి పాఠశాలల్లో చదివే విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులకు గురి చేయడానికి వీలు లేదని, విద్యార్థులకు సంబంధించిన ఫీజు ప్రభుత్వం చెల్లిస్తుందని, విద్యార్థుల తల్లిదండ్రులను ఫీజు కట్టమని అడగటం, విద్యార్థులను బయటకు పంపడం వంటి వాటికి పాల్పడితే తీవ్రంగా పరిగణించి కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.



## సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయం నిర్మాణానికి ప్రణాళికలు

**ఖమ్మం,మహా:** సకల సౌకర్యాలతో మండల కార్యాలయాల సముదాయ భవన నిర్మాణానికి ప్రణాళిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ లోని కలెక్టర్ చాంబర్ లో మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతం తరుణీ హాట్ వద్ద నిర్మించనున్న సమీకృత మండల కార్యాలయ సముదాయ నిర్మాణం పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. సమీకృత మండల కార్యాలయ సముదాయ భవనాల నిర్మాణ మ్యాప్ లను పరిశీలించి, ఆర్ అండ్ బీ అధికారులు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం రూరల్ మండల స్థాయిలో ప్రజల సౌకర్యార్థం అన్ని కార్యాలయాలు ఒకే చోట అన్ని వసతులతో ఉండే విధంగా నిర్మించాలని, దీనికి తగిన విధంగా ప్రణాళికలు, భవనాలు, కావాల్సిన వసతుల నమూనా తయారు చేయాలని అన్నారు. మండల స్థాయిలో తహసిల్దార్, ఎంపిడిఓ, సబ్ రిజిస్ట్రార్, వ్యవసాయ శాఖ మొదలగు అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండేలా సముదాయం ఉండే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. మండల కార్యాలయం నిర్మించిన తర్వాత నిర్వహణ కూడా సక్రమంగా జరిగేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. అంతర్గంగా 30 ఫీట్ల రోడ్డు, ఫైర్ సేఫ్టీ సూచనలు పాటిస్తూ నిర్మాణాలు జరగాలని అన్నారు. మండల కార్యాలయ సముదాయానికి అవసరమైన విద్యుత్ సోలార్ ప్యానెల్ ఏర్పాటు సమకూర్చుకునేలా ప్లాన్ లో పొందుపర్చాలని అన్నారు. సమీకృత మండల కార్యాలయ సముదాయం వద్ద అవసరమైన పార్కింగ్ సౌకర్యం ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు. మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా త్రాగు నీటి సరఫరా కనెక్షన్ తీసుకోవాలని అన్నారు. ప్రతి ఫ్లోర్ లో ప్రజల వెయిటింగ్ ఏరియా ఉండాలని, అక్కడ త్రాగు నీటి ట్యాప్ ఉండాలని అన్నారు. కార్యాలయాల్లో ఫైల్స్ పెట్టెందుకు స్టోరేజ్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్&బి డిఇ భగవాన్, ఏఇ కోటేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి

**భద్రాద్రి బ్యూరో, మహా:** వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఐ.డి.ఓ.సి. సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2,38,177 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా ఉందని, అందులో సన్నరకం 2,02,862 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 35,315 మెట్రిక్ టన్నులు ఉంటాయని తెలిపారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 193 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలను వివరించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,389, సాధారణ గ్రేడ్ రకానికి రూ.2,369, సన్న రకంధాన్యానికి అదనంగా 500 రూపాయలు ప్రతి క్వింటాకు 2889 మద్దతు ధర నిర్ణయించబడిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, టార్పాలిన్‌లు, తేమ కొలిచే యంత్రాలు, తూకపు పరికరాలు, గన్నీ సంచులు వంటి సదుపాయాలు సకాలంలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రైతులకు టోకెన్ల వ్యవస్థ ద్వారా రద్దీ నియంత్రణ చేపట్టాలని, రైతు ఆధార్ కార్డుతో లింక్ అయిన మొబైల్ నంబర్‌కి వచ్చే ఓటిపి ఆధారంగా రిజిస్ట్రేషన్ చేయాలని చెప్పారు. గన్నీ సంచులు ఆన్లైన్‌లో నమోదు చేసిన రైతులకు మాత్రమే ఇవ్వాలని, సంచులు తీసుకున్న వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. మన జిల్లాకు పొరుగు రాష్ట్రాల నుండి ధాన్యం రాకను నివారించేందుకు సరిహద్దుల్లో 6 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పటిష్ట నిఘా అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే ఆన్లైన్‌లో నమోదు చేసి రైస్ మిల్లులకు తరలించాలన్నారు.ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే లేదా తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సంబంధిత ఇన్‌చార్జిలపై, మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి రైతు ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులతో రావాలని సూచించారు. రైతులకు ధాన్యం విక్రయాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎంఎస్‌పి ధరలు, నాణ్యత ప్రమాణాలు, సంబంధిత అధికారుల వివరాలు, సన్న వడ్లు దొడ్డు వడ్లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి స్పష్టంగా ప్రదర్శించాలని చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత గన్నీ సంచులకు ట్యాగ్, సెంటర్ నెంబర్ వేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు త్వరితగతిన తరలించాలన్నారు. రైతు ఐరిస్ స్కానర్ ద్వారా ధాన్యం విక్రయ ప్రక్రియ పూర్తి అవుతుందని, రైతు వ్యక్తిగతంగా అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. తూకపు బాట్లు తనిఖీ చేసి సీల్స్ వేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సీఎంఆర్ 2025-26 రబీ సీజన్‌కి సంబంధించిన డెలివరీలను సకాలంలో పూర్తి చేసేలా రైస్ మిల్లులను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, పౌర సరఫరాల అధికారి రుక్మిణి, పౌర సరఫరాల సంస్థ మేనేజర్ త్రినాథ్ బాబు, డీసీఓ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి బాబూరావు, రవాణా శాఖ అధికారి వెంకటరమణ , తూనికలు-కొలతల అధికారి మనోహర్, మార్కెటింగ్ అధికారి నరేందర్, రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆనందరావు, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# బెస్ట్ అవైలబుల్ పాఠశాలల విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

**భద్రాద్రి బ్యూరో, మహా:** బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక ప్రణాళిక ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమ శాఖల అధికారులతో బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో చదివే షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల విద్యార్థుల సంక్షేమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో బెస్ట్ అవైలబుల్ పాఠశాలల పథకం క్రింద ఎంపిక చేసిన పాఠశాలలో చదివే షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్ తెగలకు చెందిన విద్యార్థుల సంక్షేమంపై ఆయా జిల్లాల కలెక్టర్లు



నిరంతరం పర్యవేక్షించాలని, విద్యార్థులకు అందిస్తున్న బోధన, ఆరోగ్యం, మెనూ ప్రకారం భోజనం, ఇతర మౌలిక వసతుల అమలుపై పాఠశాలలను సందర్శించి పరిశీలించాలని తెలిపారు. ఎంపికైన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండాలని, సమస్యల పరిష్కారంపై ఆయా పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యాబోధన కొనసాగించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల సంక్షేమంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యా బోధన, విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షించాలని, ఆయా పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు శ్రీలత , జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

**కారేపల్లి, మహా :** కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కే.రవిబాబు మంగళవారం సందర్శించారు. కళాశాలలో నిర్వహిస్తున్న తరగతి గదుల రిపేర్లను ఆయన పరిశీలించి



పనులు వేగవంతం చేయాలని సూచించారు. కళాశాలలో నిర్వహిస్తున్న ఫిజిక్స్‌వాలా, పోటీ పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్ తరగతులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. యూడైస్, అప్పార్ లను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచటానికి తగు చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌ను సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించేలా తగు తర్ఫీదు ఇప్పించాలన్నారు. ఈసందర్భంగా డీఐవో మాట్లాడుతూ ఖమ్మం జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరమ్మత్తుల కోసం రూ.2.96 కోట్లతో పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ తో కళాశాలలో హాజరు శాతం పెరిగిందన్నారు. సీసీ కెమేరాలు ఏర్పాటు చేయటం ద్వారా రాష్ట్ర ఇంటర్ విద్యాశాఖ సంచాలకుల కంట్రోల్ రూమ్‌లో పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. డీఐవో వెంట కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.విజయకుమారి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జయమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## డైలీ వేజ్ వర్కర్ల సమస్యలు పట్టని ప్రభుత్వం

**కారేపల్లి, మహా :** గిరిజన ఆశ్రమ పాఠశాలల డైలీ వేజ్, కాంటినెంట్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవటం లేదని ఆశ్రమపాఠశాల డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ నాయకులు బమ్మల అనంతరాములు ఆవేదన



వ్యక్తం చేశారు. డైలీ వేజ్ వర్కర్ల వేతనాలను పాత పద్ధతిలో ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆశ్రమ పాఠశాలల వర్కర్లు చేస్తున్న సమ్మె మంగళవారంకు 34 వరోజుకు చేరుకుంది. ఈసందర్భంగా కారేపల్లి మండలం మేకలతండా ఆశ్రమ పాఠశాల ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి అనంతరాములు మాట్లాడుతూ ప్రభుత్వం సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో వర్కర్లకు వేతనాలు పెంచాల్సింది పోయి,ఇస్తున్న వేతనాల్లో కోతలు విధించడం అన్యాయమన్నారు. గతంలో ఇచ్చిన విధంగా రోజువారి వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నందియా, మాతఅ, సారంగి, పద్మ, సరస్వతి, కళావతి, లక్ష్మి, గురువమ్మ, శ్రీను, రాధమ్మ, బుజ్జయ్య, స్వరూప, నాగయ్య, బాబుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**కారేపల్లి, మహా :** పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉచితంగా టీకాల వేసే కార్యక్రమాన్ని ఈనెల 15వ తేది నుండి ప్రారంభిస్తున్నట్లు పశు వైద్యాధికారి డాక్టర్ ఎం.ఉపేందర్ తెలిపారు. మంగళవారం పశు



వైద్యాశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 4 నెలలు దాటిన ప్రతి పాడి పశువుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం రావడం, నోటి నుండి తీగలవలె చొంగ రావటం, నోరు, కాలు గిట్టల మధ్య పుండ్లు, కొద్దిపాటి ఎండకు కూడా రొప్పడం, చూడి పశువులు ఈడుసుకపోవటం వంటి వ్యాధి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ వ్యాధి వల్ల పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందని, పని సామర్థ్యం గణనీయంగా తగ్గి రైతుకు ఆర్థిక నష్టంకల్గిస్తాయన్నారు. నాల్గు టీమ్‌లుగా ఈనెల 15వ తేదిన ప్రారంభించి వచ్చే నెల 11వ తేదివరకు టీకాలు వేయటం జరుగుతుందన్నారు. వివరాలకు సంబంధిత పుశు వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు.

## నగరంలో అపరిశుభ్రతపై కమిషనర్ ఆగ్రహం

**ఖమ్మం, మహా:** ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో శానిటేషన్ పర్యటన నిర్వహించారు. మమతా రోడ్, చెరువు బజార్, బోనకల్ రోడ్, ముస్తఫా నగర్, దంసలాపురం రోడ్, శ్రీనివాస్ నగర్, ప్రకాష్ నగర్ ప్రాంతాల్లో శుభ్రత పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. బోనకల్ రోడ్‌లో ఉన్న పబ్లిక్ టాయిలెట్స్ పరిశీలించిన కమిషనర్, ప్రతి టాయిలెట్‌ను ప్రతిరోజు తెరిచి శుభ్రంగా ఉంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# తస్మాత్ జాగ్రత్త!

- మైలవరం ఇటుకల మాయాజాలం
- ఆంధ్ర నుంచి నాణ్యత పేరుతో నకిలీ ఇటుకలు
- తెలంగాణలో బహిరంగ దోపిడీ!
- ఇటుక ఒక్కొంటికి రూపాయి తక్కువ
- కౌంటింగ్ లో గుట్టుగా మోసం చేస్తున్న వైనం
- ఇందిరమ్మ ఇళ్ల కలను ఇటుకల మోసం



**ఖమ్మం, మహా:** ఇందిరమ్మ ఇళ్ల పథకం పునఃప్రారంభంతో పేదలలో ఉత్సాహం వెల్లివిరుస్తోంది. సంవత్సరాలుగా ఎదురుచూసిన తమ గృహ కల నెరవేరబోతుందనే ఆశతో చాలామంది కూలీలు, రైతులు, చిన్న వ్యాపారులు తమ పొదుపును ఇటుకలపై పెట్టుబడిగా పెట్టారు. అయితే అదే ఉత్సాహాన్ని ఆంధ్రప్రదేశ్ నుండి కొందరు మోసగాళ్లు లాభం కోసం ఉపయోగించుకుంటున్నారు. 'మైలవరం ఇటుకలు' అని పేరుపెట్టి తెలంగాణ మార్కెట్‌లో నకిలీ వ్యాపారం ప్రారంభించిన ఈ వ్యాపారులు, తక్కువ ధరలో ఇటుకలు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారు. ఒక్క రూపాయి తక్కువ ధర అనే మాయలో చిక్కుకున్న లబ్ధిదారులు అసలు దోపిడీ ఎక్కడ జరుగుతోందో గ్రహించకపోవడం దురదృష్టకరం. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగం అందుకోవడంతో ఇటుకల డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ అవకాశాన్ని బంగారు గనిగా చూసిన కొందరు ఆంధ్ర రాష్ట్ర వ్యాపారులు, 'మైలవరం ఇటుకలు' అని చెప్పి తెలంగాణలోకి లారీల ద్వారా ఇటుకలను పెద్ద మొత్తంలో సరఫరా చేయడం ప్రారంభించారు. వీరు "మా ఇటుకలు నాణ్యత గలవి, ధర తక్కువ" అంటూ ప్రలోభపెట్టి ప్రజలను ఆకట్టుకుంటున్నారు. అసలు మోసం ఇక్కడే మొదలవుతుంది. తెలంగాణ వ్యాపారులు ఇటుక ఒక్కొంటికి ?9 వసూలు చేస్తున్నా, వీరు ?8 అని చెప్పి కొనుగోలుదారుల విశ్వాసాన్ని గెలుచుకుంటారు. కానీ డెలివరీ సమయంలో ప్రతి 50 ఇటుకలకు ఒక ఇటుకను "అదనంగా" ప్రక్కన పెడతామని చెప్పి, ఆ తరువాత వాటినీ లెక్కలో కలిపి అదనంగా డబ్బు వసూలు చేస్తున్నారు. ప్రతి లారీతో ఏడుగురు వ్యాపారులు వస్తారు. నలుగురు లారీపై నుండి ఇటుకలను కిందకు పడవేస్తుంటే, మరో ముగ్గురు చుట్టుపక్కల వారితో మాటల్లో మునిగిపోయేలా చేసి మోసాన్ని చాకచక్యంగా నిర్వహిస్తారు. కొణిజర్ల, వైరా, తల్లాడ మండలాల్లో పలు గ్రామాలు ు ముఖ్యంగా పెద్దమునగాల, పల్లిపాడు ప్రాంతాల్లోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఈ దందాకు బలయ్యారు. ఈ మోసం నిరక్షరాస్యులైన, గ్రామీణ పేదలపై తీవ్రమైన ఆర్థిక ప్రభావం చూపుతోంది. ఇల్లు నిర్మించుకోవడంలోనే సగం అప్పులపాలైన ప్రజలు, ఇలాంటి వ్యాపారుల చేతిలో రెండోసారి దోపిడీకి గురవుతున్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్ రావు మాట్లాడుతూ ు "ఇటుకలను కొనుగోలు చేసే సమయంలో ప్రజలు తప్పక లెక్కపెట్టాలి. ఎవరైనా మైలవరం ఇటుకల పేరుతో వస్తే గ్రామ పెద్దలు, యువకులు వారిని ప్రశ్నించాలి. ఇటువంటి మోసాలు తక్షణం పోలీసులకు తెలియజేయాలి," అని విజ్ఞప్తి చేశారు. అలాగే పోలీస్ శాఖ కూడా ఈ తరహా ఇటుక వ్యాపారులపై నిఘా పెట్టి, ప్రతి లారీపై సరుకు తనిఖీలు నిర్వహించాలని ఆయన కోరారు. "ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల కల. దాన్ని మోసగాళ్ల లాభ యంత్రంగా మార్చనీయకూడదు," అని ఆయన పేర్కొన్నారు.

## టన్ను చెరుకు ధర రూ.3578

**నేలకొండపల్లి, మహా :** మధుకాన్ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు రైతులకు అన్ని సబ్సీడీలతో కలిపి టన్ను రూ.3578.35 లను ఇవ్వనున్నట్లు ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ నామా కృష్ణయ్య పేర్కొన్నారు. మండలం లోని రాజేశ్వరపురం వద్ద నున్న ఫ్యాక్టరీలో తన చాంబర్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు...ఈ ఏడాది క్రషింగ్ సీజన్ లో రైతులకు మద్దతు



ధరను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఫ్యాక్టరీ నష్టాలలో ఉన్నప్పటకీ రైతుల సంక్షేమం కోసం యాజమాన్యం ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే రూ.210 అదనంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. చెరుకు రైతులకు చెరుకు నాటే వారికి 3 టన్నుల విత్తనం మరియు పిలకతోట లో ఖాళీలు పూరించటానికి 500 మొక్కలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. అధిక దిగుబడి సాధించిన రైతులకు ప్రథమ రైతుకు రూ.1 లక్ష, రెండో రైతులకు రూ.50 వేలు, మూడో బహుమతి రూ.25 వేల నగదు ను అందించనున్నట్లు ప్రకటించారు. అదే విధంగా అత్యధికంగా చెరుకు సరఫరా చేసిన, అధునిక పద్ధతిలో చెరుకు సాగు చేసిన రైతులకు, ఎక్కువ చెరుకు ను సరఫరా చేసిన రైతులకు యాంత్రీకరణ పద్ధతి, ప్రదర్శనా క్షేత్రంలో సాగు చేసి అధిక దిగుబడి సాధించిన రైతులకు ప్రోత్సాహాలకు అందించనున్నట్లు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం ఇతర రాష్ట్రాల మాధిరిగా టన్ను కు రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం ను చెరుకు పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో కోరినట్లు తెలిపారు. అదే విధంగా ఆయా మంత్రులను సమాఖ్య కలవనున్నట్లు తెలిపారు. 85 వేల మెట్రిక్ టన్నుల చెరకు ను గానుగ ఆడించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. డిసెంబర్ మొదటి వారంలో క్రషింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులు నూతన పద్ధతలు పాటించి దిగుబడి సాధించాలని కోరారు. ఫ్యాక్టరీ అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు

**ఖమ్మం రూరల్, మహా:** బారుగూడెం గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నించగా, రెవెన్యూ అధికారులు సమయానికి జోక్యం చేసుకొని భూమిని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సర్వేనెంబర్ 26లో జరిగిన ఈ ఘటనపై తహసీల్దార్ రాంప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తి అని, వాటిని ఎవరూ స్వార్థ ప్రయోజ నాల కోసం వాడుకోరాదని ఆయన తెలిపారు. ఆక్రమణలు తొలగిం చడమే కాకుండా, చట్టపరమైన చర్యలు కూడా తప్పవని స్పష్టం చేశారు. గతంలో ఈ భూమి అసైన్మెంట్ దారుల వద్ద నుండి తిరిగి ప్రభుత్వ అధీనంలోకి తీసుకున్నా మని, ప్రస్తుతం ఎవరు పెన్సింగ్‌లు వేయకూడదని లేదా ఆక్రమణ ప్రయత్నం చేయ కూడదని ఆయన హెచ్చరించారు.

FOLLOW: @ANNTELUGU
15-10-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# పార్టీ క్రమశిక్షణే ప్రమాణం...!



**పాలేరు, మహా:** ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుని (డీసీసీ) ఎంపిక ప్రక్రియ వేగం పుంజుకుంది. ఏఐసీసీ ఆదేశాల మేరకు, పీసీసీ సూచనల ప్రకారం మంగళవారం అభిప్రాయ సేకరణ సమావేశాలు నిర్వహించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ... జిల్లాలో అందరికీ ఆమోదయోగ్యమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఈ సమావేశాలు చురుగ్గా సాగాయి. ఉదయం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రెడ్డిపల్లిలో ఉన్న అమ్మ ఫంక్షన్ హాల్లో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, తిరుమలాయపాలెం మండలాల బ్లాక్ కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేక సమావేశం జరిగింది. పార్టీ భవిష్యత్ దిశ, క్రమశిక్షణ, నాయకత్వం అవసరాలపై నాయకులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. మధ్యాహ్నం కూసుమంచి మండల కేంద్రంలోని ఎస్.ఆర్. ఫంక్షన్ హాల్లో నేలకొండపల్లి, కూసుమంచి మండలాలకు చెందిన బ్లాక్ కాంగ్రెస్ ముఖ్య నాయకులతో మరో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏఐసీసీ అబ్జర్వర్ మహేంద్ర జినీ, పీసీసీ అబ్జర్వర్లు పాల్గొని నాయకులతో సమీక్ష జరిపారు. ఈ సమావేశాల్లో ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 600 క్వింటాల బియ్యం సీజ్...!



**నేలకొండపల్లి, మహా:** నేలకొండపల్లి ఓ రైస్ మిల్లు లో నిల్వ ఉంచిన బియ్యం ను సివిల్ సప్లై అధికారులు సీజ్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లో ఓ రైస్ మిల్లు లో పీడీఎస్ బియ్యం ను ఉంచినట్లు సమాచారం మేరకు సివిల్ సప్లై, టాస్క్ ఫోర్స్, పోలీసులు సంయుక్త దాడులు చేశారు. ఆకస్మిక దాడిలో దాదాపు 600 క్వింటాల బియ్యం ను పీడీఎస్ గా అనుమానంతో సీజ్ చేశారు. అవి పీడీఎస్ బియ్యం కాదా అని .నిర్ధారణ కోసం టెక్నికల్ ల్యాబ్ కు పంపించారు. మిల్లు ను జిల్లా సివిల్–సప్లై అధికారి చందనక్కుమార్ మంగళవారం మిల్లు ను తనీఖీ చేశారు. సీజ్ చేసిన బియ్యం ను పరిశీలించారు. పట్టుబడ్డ బియ్యం ఎక్కడ నుంచి వచ్చినవి...ఎవరు తీసుకొచ్చారు. బియ్యం అక్రమార్కులు ఎవరూ అనే వివిధ కోణాలలో విచారణ చేపట్టారు. సన్న బియ్యం ను కూడ కొనుగోలు చేయటం పట్ల... లోతుగా ఆరా తీస్తున్నారు. వ్యాపారుల పై ప్రత్యేక దృష్టి సారించేలా కార్యచరణ ను రూపొందించాలని యోచిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తం లో బియ్యం దొరకటం సంచలనంగా మారింది. ల్యాబ్ రిపోర్టు మరో రెండు రోజులలో ' రావచ్చని...నివేదిక అందిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లై అధికారులు పేర్కొన్నారు. ఈ దాడులలో సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ నాగలక్ష్మి, టాస్క్ పోర్స్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**నేలకొండపల్లి, అక్టోబర్ 14 మహా:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రం ను సద్వినియోగం చేసుకోవాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ,చలపతిరావు సూచించారు. మండలం లోని చెన్నారం ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఆధార్ కేంద్రం ను ఏర్పాటు చేశారు. పలువురు విద్యార్థులు ఆధార్ కేంద్రం ను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా యంఈవో మాట్లాడారు... ఆధార్ కార్డు లేని విద్యార్థులు కొత్త కార్డు కోసం చేయించుకోవాలని సూచించారు. అదే విధంగా ఆధార్ కార్డులో తప్పులు, సవరణ లు చేసుకునే వీలు ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సౌలభ్యం కోసం ఆధార్ ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీపాఠశాల లో విద్యార్థులు ఆధార్ కార్డు ను చేయించుకోవాలని అన్నారు. కేంద్రాల పై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# బియ్యం బస్తాల మాయం!



## వైరా ఏఎంసీలో రేషన్ దందా వెనుక అధికారుల ముఠా!

- నాణ్యత లేని బియ్యానికి ఫుల్ సర్టిఫికేట్!
- పేదల అన్నంలో అవినీతి తుపాన్
- వైరా-మధిర-జూలూరుపాడు బియ్యం మాఫియా బహిర్గతం!




**ఖమ్మం బ్యూరో, మహా:** ఖమ్మం జిల్లా వైరా రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌లో బియ్యం బస్తాల అక్రమాలు వెలుగులోకి రావడంతో ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తుతోంది. మధిర నియోజకవర్గంలోని ఓ రైస్ ఇండస్ట్రీస్ నుంచి సరఫరా అయిన 580 బస్తాల్లో కేవలం 186 మాత్రమే అధికారిక రికార్డుల్లో కనిపించగా, మిగతా 394 బస్తాలు మాయమయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేదల రేషన్ బియ్యాన్ని రికార్డులపై దిగుమతి చూపించి, నేలమీద మాయం చేయడం వైరా ఏఎంసీ లో జరుగుతున్న భయంకర దందాను బయటపెడుతోంది. అధికారులు, మిల్లర్లు, క్వాలిటీ కంట్రోల్ టీమ్ కలిసి కోట్ల రూపాయల అక్రమ సంపాదన చేస్తున్నట్టు ఆధారాలు బయటపడుతున్నాయి. మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడి విద్యార్థుల కోసం ఇచ్చే బియ్యాన్ని కూడా నాణ్యత లేని రైస్‌తో భర్తీ చేసి పేదల ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టారని స్థానికులు మండిపడుతున్నారు. ఒక క్వింటాకు రూ.3,500 చొప్పున లంచాలు, నకిలీ సర్టిఫికేట్లు, రిజిస్టర్లలో వైట్నర్‌తో సాక్ష్యాల చెరపడం, గోప్య ఒప్పందాలు .. ఇవన్నీ వైరా ఏఎంసీ అవినీతి చక్రం ఎంత లోతుగా పాతుకుపోయిందో సూచిస్తున్నాయి. నెలకు కేవలం 10 రోజులు డ్యూటీ చేసిన మహిళా అధికారి కోట్ల రూపాయల విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని ఆరోపణలు రావడం కూడా అధికారులపై అనుమానాల ముసురు కమ్మిస్తోంది. ప్రజల ఫిర్యాదులున్నా, రీజినల్ మేనేజర్ వీరమల్లు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పై స్థాయి అధికారులు మౌనం సాధించడం ప్రశ్నార్థకం అయింది. వైరా, మధిర, జూలూరుపాడు, తాటిపూడి, ఎర్రుపాలెం ఏఎంసీ పాయింట్ల నుంచి ఒకే తరహా దందాలు జరుగుతున్నాయన్న వార్తలు బయటకు రావడంతో, ఈ అవినీతి కేవలం ఒక్క కేంద్రానికి పరిమితం కాలేదని స్పష్టమవుతోంది. జిల్లాలోని మార్కెట్ కమిటీ గోదాములు, రైస్ మిల్లులు ఇప్పుడు అవినీతి కేంద్రాలుగా మారిపోయాయని ప్రజల్లో వాదన బలంగా వినిపిస్తోంది. వైరా ఏఎంసీ గోదాములో ఉన్న రేషన్ బియ్యం సరఫరాపై ఇటీవల పలు పత్రాలు వెలుగులోకి వచ్చాయి. అందులో 580 బస్తాల్లో 186 మాత్రమే రికార్డుల్లో ఉండగా, మిగతా 394 బస్తాలు గల్లంతయ్యాయని స్పష్టంగా కనిపిస్తోంది. ఈ బస్తాలు మధిర నియోజకవర్గంలోని ఓ రైస్ ఇండస్ట్రీ నుంచి పంపబడినవని సమాచారం. బస్తాల మాయాజాలం వెనుక అధికారుల చేతివాటం ఉండవచ్చని స్థానికులు ఆరోపిస్తున్నారు. బియ్యం దిగుమతి, నిల్వ, పంపిణీ వంటి అంశాలను పర్యవేక్షించే క్వాలిటీ కంట్రోల్ అధికారి "రామచంద్రన్న" ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాణ్యత లేని బియ్యానికి కూడా "100% క్వాలిటీ సర్టిఫికేట్" ఇచ్చి కోట్ల రూపాయల లంచాలు స్వీకరిస్తున్నారని ఆధారాలు చెబుతున్నాయి. "ఒక ఏసీకేకు రూ.50 వేల చొప్పున ఇవ్వకుంటే బియ్యాన్ని అంగీకరించరని" మిల్లర్లు గోప్యంగా చెబుతున్నారు. వైరా ఏఎంసీ మహిళా అధికారి నెలకు పది రోజులే డ్యూటీ చేస్తున్నా, ఆమె ఆధ్వర్యంలో జరుగుతున్న లావాదేవీలు కోట్ల రూపాయల స్థాయిలో ఉన్నాయని ఆరోపణలు రావడం సంచలనం. ఆమె ఎర్రుపాలెం రైస్ ఇండస్ట్రీస్ యాజమాన్యంతో గోప్య ఒప్పందం చేసుకుని ప్రతి డెలివరీపై కమిషన్ తీసుకుంటున్నట్టు సమాచారం.

# దగాపడ్డ స్వాతంత్ర్య సమరయోధుడు

## వృద్ధురాలిని మోసగించిన చిన్న మనవడు!... దొంగ పత్రాలతో గిఫ్ట్ రిజిస్ట్రేషన్.. ఆపై విక్రయం

**ఖమ్మం, మహా:** భూమి అంటే కేవలం మట్టి కాదు ..ఆ భూమిలో చరిత్ర ఉంది, త్యాగం ఉంది, ఒక వృద్ధ దంపతుల కన్నీరు ఉంది. స్వాతంత్ర్య సమరయోధుడు దేశ స్వేచ్ఛ కోసం పోరాడి, త్యాగ జీవితానికి గుర్తుగా ప్రభుత్వం ఇచ్చిన స్థలం నేడు మోసపూరిత చేతుల్లో చిక్కుకోవడం మన సమాజానికి నల్ల మచ్చ. వృద్ధురాలిని ఆధార్ అప్‌డేట్ పేరుతో మోసం చేసి, ఆమె విశ్వాసాన్ని ద్రోహించిన మనవడు, స్వాతంత్ర్య స్ఫూర్తికి అవమానం చేశాడు. ఈ వ్యవహారం కేవలం కుటుంబ వివాదం కాదు ..ఇది మన సమాజ నైతిక విలువల పతనానికి ప్రతిబింబం. ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధునికి ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలం, అలాగే చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూమి కూడా అక్రమంగా కొట్టేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం, ఆ సమరయోధుడికి ఇద్దరు కుమారులు ఉండగా, చిన్న కుమారుడి కొడుకు (మనవడు) "ఒకడే కొడుకు ఉన్నాడు" అని తప్పుడు వివరాలు చూపించి, వృద్ధురాలిని ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేయిస్తామని నమ్మబలికి, దొంగ పత్రాల ఆధారంగా గత నెల 17 న ఖమ్మం రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తన పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఇది కూడా చాలు అన్నట్టుగా, ఆ గిఫ్ట్ రిజిస్ట్రేషన్ ఆధారంగా ముదిగొండ మండలం సువర్ణపురం గ్రామ మాజీ సర్పంచ్ భర్తకు ఆ భూమిని మళ్లీ అమ్మివేసి, గత నెల 29 న అదే రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అమ్మక రిజిస్ట్రేషన్ జరిపినట్టు ఆధారాలు చెబుతున్నాయి. ఇంతలో వృద్ధురాలికి ఈ వ్యవహారం తెలిసేలోపు, "విషయం బయటకు పొతుందేమో" అనే భయంతో ఆమెను తెల్దారుపల్లి గ్రామానికి పంపించి దాచినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ మోసపూరిత లావాదేవీ ద్వారా స్వాతంత్ర్య సమరయోధుడి నిజమైన వారసులను చట్టపరంగా, నైతికంగా మోసం చేయడమే కాకుండా, ఆ భూమిని తాకట్టు పెట్టి బ్యాంకుల్లో లేదా వడ్డీ వ్యాపారుల వద్ద డబ్బులు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు సమాచారం అందింది. స్థానిక ప్రజలు ఈ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "దేశానికి ప్రాణం అర్పించిన వీరుడి ఆస్తిని ఈ విధంగా దోపిడీ చేయడం హేయకర్మ" అని తీవ్రంగా విమర్శించారు. గ్రామస్తులు ,బాధిత కుటుంబ సభ్యులు అధికారులను విజ్ఞప్తి చేస్తూ, "రిజిస్ట్రేషన్ పత్రాలు దర్యాప్తు చేయాలి, వృద్ధురాలికి రక్షణ కల్పించాలి" అని కోరుతున్నారు. ఇక, ఈ ఘటనలో పాత్రధారు లుగా ఉన్న మనవడు మాజీ సర్పంచ్ భర్తపై చట్టపర చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వానికి మరియు రిజిస్ట్రేషన్ విభాగానికి గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు.

# మీడియాపై మేనేజర్ దురుసు ప్రవర్తన!

## జర్నలిస్టుల గౌరవం కించపరిచిన వైరా మున్సిపల్ మేనేజర్

### ఆర్డీఎంఏ ముందు మేనేజర్ తీరుపై జర్నలిస్టుల ఫిర్యాదు



**ఖమ్మం, మహా:** ప్రజాసేవకు అంకితమైన నాలుగో స్తంభం మీడియా. ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చే ఈ వృత్తి ప్రతినిధులపై ఏ ప్రభుత్వాధికారి అయినా గౌరవం చూపడం ప్రజాస్వామ్య విధానం. అయితే ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీలో జరిగిన తాజా సంఘటనలో మీడియా గౌరవం తలదన్నేలా మున్సిపల్ మేనేజర్ ప్రవర్తించారనే వార్త ఆందోళన కలిగిస్తోంది. ప్రజా ప్రయోజనాల కోసం సమాచారం సేకరించేందుకు వచ్చిన జర్నలిస్టులను "ఎవరు లోపలికి రానిచ్చారు?", "వారిని ఎందుకు కూర్చోనిచ్చారు?" అంటూ అవమానకరంగా మాట్లాడటం మేనేజర్ ప్రవర్తనలోని అహంకారాన్ని బట్టబయలు చేసింది. ఈ ఘటనపై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆర్డీఎంఏకు ఫిర్యాదు చేశారు. వైరా మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న మేనేజర్ సుధాకర్ ప్రవర్తన ఇప్పుడు స్థానికంగా పెద్ద చర్చకు దారి తీసింది. మున్సిపల్ కార్యాలయాన్ని సోమవారం వరంగల్ నుంచి వచ్చిన ఆర్డీఎంఏ (రూరల్ డెవలప్మెంట్ మానిటరింగ్ అథారిటీ) అధికారి షాహిద్ మసూద్ పరిశీలన కోసం సందర్శించారు. ఈ సమాచారం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు అధికారుల సమావేశాన్ని కవరేజ్ చేయడానికి కార్యాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో ఆర్డీఎంఏ అధికారి మున్సిపల్ సిబ్బందితో చర్చిస్తుండగా, మున్సిపల్ కమిషనర్ గురులింగం బయటికి వచ్చి, "మీడియా మిత్రులు రండి, పక్క గదిలో కూర్చోండి" అంటూ స్నేహపూర్వకంగా ఆహ్వానించారు. జర్నలిస్టులు కూడా మర్యాదగా పక్క గదిలో కూర్చున్నారు. కానీ కొద్దిసేపటికే అక్కడకు వచ్చిన మేనేజర్ సుధాకర్ ఆకస్మికంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "మీడియా ఎవరు లోపలికి రానిచ్చారు? వారిని ఎందుకు కూర్చోనిచ్చారు? వెంటనే బయటకు పంపించండి!" అంటూ తోటి అధికారులను ఆదేశించారు. ఈ మాటలు అక్కడ ఉన్న ఇతర సిబ్బందిని, జర్నలిస్టులను అవమానపరిచేలా మారడంతో వాతావరణం ఉద్రిక్తంగా మారింది. సంఘటనను బయటకు వచ్చిన మీడియా ప్రతినిధులు ఆర్డీఎంఏ షాహిద్ మసూద్ గారికి వివరించారు. పరిస్థితి తెలుసుకున్న ఆర్డీఎంఏ, మేనేజర్ సుధాకర్ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీడియాపై అలా మాట్లాడకూడదు, వారు ప్రజల కళ్లు చెవులు" అంటూ మేనేజర్ను మందలించినట్లు సమాచారం. ఈ ఘటనపై స్థానిక జర్నలిస్టులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్యంలో మీడియాను అవమానించడం అంటే ప్రజలే అవమానించడం" అంటూ స్పందించారు. మర్యాద, శ్రద్ధలతో పనిచేసే అధికారులలో కొందరు ఇలా వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఆర్డీఎంఏకు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించి, మేనేజర్ ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు కూడా ఈ సంఘటనపై అసంతృప్తి వ్యక్తం చేశారు. "వైరా మున్సిపాలిటీ ప్రతిష్టను దెబ్బతీసేలా ఆయన వ్యవహరించారు. జర్నలిస్టులను గౌరవించని అధికారికి మున్సిపల్ వ్యవహారాలు అర్థం కావు" అంటూ పలువురు వ్యాఖ్యానించారు. జర్నలిస్టుల సంఘాలు కూడా ఈ ఘటనపై స్పందించనున్నాయి. మీడియా ప్రతినిధుల గౌరవం కాపాడటం, ప్రజా సేవకుల బాధ్యత అని సంఘాలు పేర్కొంటున్నాయి.

## చిన్నారులు ధైర్యంగా ముందుకు సాగాలి



**మణుగూరు/పినపాక, మహా:** విద్యార్థి దశ నుంచే బాలికలు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో జీవించడంతో పాటు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి విద్యార్థులకు సూచించారు. పినపాక మండల పరిధిలోని ఏలాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన న్యాయ చైతన్య సదస్సులో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సదస్సు అక్టోబర్ 11న జాతీయ బాలికల దినోత్సవ సందర్భంగా నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వలన నిర్వహించలేకపోయినట్లు విద్యార్థులకు తెలిపారు. చిన్నారుల రక్షణ, హక్కుల పరిరక్షణకు దేశంలో పలు చట్టాలు ఉన్నాయని గుర్తుచేశారు. బాలికలు జీవితంలో ముందుకు సాగేటప్పుడు సమాజం, కుటుంబం ఇచ్చే మార్గదర్శకత్వంతో పాటు చట్టపరమైన అవగాహన కూడా అవసరమని పేర్కొన్నారు. పోక్సో చట్టం చిన్నారులను లైంగిక దాడుల నుండి రక్షించడానికి, చైల్డ్ లేబర్ ప్రొహిబిషన్ అండ్ రెగ్యులేషన్ చట్టం పిల్లలను బలవంతపు పనుల నుండి కాపాడటానికి, రైట్ టు ఎడ్యుకేషన్ చట్టం 6 నుండి 14 ఏళ్ల పిల్లలకు ఉచిత విద్యను హక్కుగా కల్పించడానికి ఉందని వివరించారు. ఏ అన్యాయం జరిగినా భయపడకండి. పోలీసులకు, తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు వెంటనే సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏడూళ్ల బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్, మండల లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అంకం సర్వేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు చిర్ర రవి, సరస్వతి పోశం భాస్కర్ గద్దల సాంబశివరావు అశోక్ రమేష్ బాబు లోకేష్ చారి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం



**ఖమ్మం, మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. మంగళవారం ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నవంబర్ 11న జరగనున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాలుపంచుకుని పార్టీ అభ్యర్థి మాగంటి సునీత గెలుపుకోసం కృషి చేయాలని పువ్వాడ పిలుపునిచ్చారు. "దివంగత నేత మాగంటి గోపినాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఆయనతో నాకు వ్యక్తిగత సాన్నిహిత్యం ఉంది. ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల సమయంలో కరోనా వ్యాప్తి ఉన్నప్పటికీ గోపినాథ్ గారు స్వయంగా వచ్చి ఇక్కడ కార్యకర్తలతో కలిసి పనిచేసి, బీఆర్ఎస్ విజయానికి కీలకంగా సహకరించారు. అలాంటి నేత రుణం తీర్చుకోవాలంటే, ఈ ఉప ఎన్నికల్లో ఆయన సతీమణి మాగంటి సునీత గారిని గెలిపించాలి" అని పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నగర బీఆర్ఎస్ అధ్యక్షులు పగడాల నాగరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్జేసీ కృష్ణ, టేకులపల్లి సొసైటీ చైర్మన్ బీరెడ్డి నాగచంద్ర రెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖమర్, విజయ్ కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా కొమరం భీమ్ వర్ధంతి వేడుకలు



**మణుగూరు, మహా:** గోండుల వీరపుత్రుడు, ఆదివాసీ హక్కుల పరిరక్షకుడు కొమరం భీమ్ 85వ వర్ధంతి వేడుకలు మణుగూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి వర్స శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొమరం భీమ్ నిజాం పాలనలో ఆదివాసీలు ఎదుర్కొన్న దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన వీరుడని కొనియాడారు. జల్, జంగల్, జమీన్ అనే నినాదంతో ఆదివాసీల జీవనాధార వనరుల రక్షణ కోసం ఉద్యమం నడిపారన్నారు. ఆయన ఆశయాలను నెరవేర్చడం ప్రతి ఆదివాసీ కర్తవ్యమన్నారు. ఆదివాసీలు ఐక్యంగా తమ హక్కుల సాధన కోసం పోరాట పంథాను కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు మట్ట వినోద్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వర్స విజయ్, జిల్లా ప్రచార కార్యదర్శి సుతారి వెంకన్న, బచ్చల సోమేష్, బంద రాంబాబు, కొమరం పాపారావు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు హుస్సేన్, ఏడుకొండలు వెంకటేశ్వర్లు, రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు సరోజ పాల్గొన్నారు.

## ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలి



**నేలకొండపల్లి, అక్టోబర్ 14 మహా:** ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రైతులకు ధాన్యంతో పాటు పత్తి చేతికి అందుతున్న తరుణంలో ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ(ఎం) పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో బెల్లం లక్ష్మీ అధ్యక్షతన జరిగిన పార్టీ మండల జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు చెల్లించడంలో, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకో వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన రెండు లక్షల రైతుల రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయకపోవడంతో పాటు ఎకరానికి 500 రూపాయల పెండింగ్ బోనస్ ను నేటికీ ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒకవైపు ధాన్యం మరోవైపు పత్తి పంట చేతికొస్తుండడంతో అమ్ముకునేందుకు ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపో వడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు షేక్ బషీరుద్దీన్, గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి, ఏటుకూరి రామారావు, భూక్య కృష్ణ, మధు, పెదపాక మల్లేశ్వరరావు, గురజాల వెంకటేశ్వర్లు, గాదె వెంకటేశ్వర్లు, పొన్నం శివరాజు, దండా సైదారావు, తీగ కొండలరావు, నాగేశ్వరరావు, పోతనబోయిన పెరుమాళ్ళు, సామల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.